క్లుప్తంగా

చీరాల ఏపీఎంగా మధు



చీరాల టౌన్: ఐకేపీ మండల ఏపీఎంగా మధు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న గద్దె సుబ్బారావు చినగంజాం ఏపీఎంగా బదిలీ కావడంతో చీరాల ఏపీఎంగా కారంచేడు ఏపీఎంగా పనిచేస్తున్న మధును నియమించారు. ఈసందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ మహిళాభివృద్ధికి ప్రణాళికబద్ధంగా కృషి చేయడంతో పాటుగా సత్వరంగా రుణాలు అందించి మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందేందుకు పూర్తి సహకారం అందిస్తామన్నారు.

నేడు కృష్ణావతారతత్వం ఆధ్యాత్మిక ప్రవచనం

చీరాల రూరల్: ఆధ్యాత్మిక పీఠం చీరాల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక స్వర్ణరోడ్డులోని లయన్స్ క్లబ్ సర్వీసు ట్రస్టు బిల్డింగ్‌లో సాయంత్రం 6:30 గంటలకు కృష్ణావతారతత్వం అను ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించనున్నట్లు పీఠం అధ్యక్షుడు వీవెంకటరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈప్రవచనం ఉపన్యాసకుడిగా అద్దంకికి చెందిన ప్రముఖ కవి డీవీఎం. సత్యనారాయణ వ్యవహరిస్తారని తెలిపారు. ప్రతినెలా మొదటి ఆదివారం క్రమం తప్పకుండా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కనుక అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మండల వీఆర్ఏ సంఘం అధ్యక్షుడిగా అనిల్



చినగంజాం: మండల రెవెన్యూ సహాయకుల సంఘం నూతన కమిటీ ఎన్నిక శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. మండల వీఆర్ఏ నూతన సంఘం అధ్యక్షుడిగా పెదగంజాం రెవెన్యూ గ్రామానికి చెందిన వీఆర్ఏ మాచవరపు అనిల్ కుమార్‌ను, ఉపాధ్యక్షుడిగా మేడికొండ శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులుగా ఎంపికైన వారిని మిగిలిన సభ్యులను డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు శుభాకాంక్షలు తెలియజేశారు.

రేషన్ బియ్యం స్వాధీనం



పోలీసు స్టేషన్ వద్ద ఉంచిన ఆటో

కారంచేడు: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని కారంచేడు పోలీసులు పట్టుకున్నారు. శనివారం చినగంజాం ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు మండలంలోని స్వర్ణ దండుబాట రోడ్డులో వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో చీరాల నుంచి అద్దంకి వైపు వెళ్తున్న ఆటోను ఆపి తనిఖీ చేయగా అందులో 50 కేజీ బియ్యం బస్తాలు 50 ఉన్నట్లు గుర్తించారు. అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యంగా గుర్తించిన పోలీసులు వాహనాన్ని సీజ్ చేశారు. డ్రైవర్ గోపిపై కేసు నమోదు చేసి వాహనాన్ని కారంచేడు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

జాబ్‌మేళాలో 27 మందికి ఎంపిక

చీరాల అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం చీరాలలోని వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో జాబ్ మేళా నిర్వహించారు. ఈమేళాకు అపోలో ఫార్మసీ, ఎస్‌బీఐ క్రెడిట్ కార్డ్స్, టాటా క్యాపిటల్ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. జాబ్‌మేళాకు ముఖ్యఅతిథిగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నీలాకుమారి హాజరై మాట్లాడారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ నిర్వహించే జాబ్‌మేళా, శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్‌మేళాకు మొత్తం 57 మంది హాజరుకాగా వారిలో 27 మంది ఎంపికయ్యారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్, జేకేసీ కో–ఆర్డినేటర్ సాయి ప్రసన్న, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బి.శ్రీనివాస్, కో–ఆర్డినేటర్లు హారిక, బుల్లయ్య, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ వృద్ధులకు అన్నదానం



అహారం అందిస్తున్న సంస్థ సభ్యులు

చీరాల అర్బన్: అనాథలు, నిరుపేదలకు, వయోవృద్ధులైన 50 మందికి భోజనం, మంచినీటి బాటిల్స్, స్వీట్లను శనివారం పంపిణీ చేశారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా చీరాలలోని మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ ప్రాంగణంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. మానవత సేవా సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ బి.హేమంతకుమార్, కన్వీనర్ బత్తుల బ్రహ్మారెడ్డి, సంస్థ అధ్యక్షుడు ఎ.నాగవీరభద్రాచారి, కార్యక్రమ సమన్వయకర్త పోలుదాసు రామకృష్ణ, సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మండుతున్న నూనెలు!



- ఆకాశాన్నంటిన పామాయిల్, సన్‌ఫ్లవర్ ధరలు
- వారం రోజుల్లోనే మిన్నంటిన వైనం
- కూటమి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతోనే ధరల పెంపు

అద్దంకి:

తమ్ముళ్లు.. కూటమి అధికారంలోకి రాగానే నిత్యావసర ధరలు, పెట్రోల్ ధరలు తగ్గిస్తాం.. మాకు ఓటేయ్యండి అని ఎన్నికల ముందు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు ఊదరగొట్టారు. తీరా అధికారంలోకి వచ్చాక తెప్ప తగలేసినట్లు ధరల తగ్గించడం పూర్తిగా మానేశారు. ఈవంద రోజులు పాలన నుంచి ప్రజల దృష్టి మరల్చడానికి లేనిపోనివి సృష్టించి ప్రతిపక్షంపై బురదజల్లుతున్నారు. అంతకాదు 'ఇది మంచి ప్రభుత్వం' అంటూ ఇంటింటికి తిరిగి ప్రచారం చేయాలని ఉద్యోగులను పురమాయించాడు. అసలు ఏం చేశాడని.. ఏం పథకాలు అందించాడని ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

కొండెక్కిన వంటనూనె ధరలు..

అసలే కూరగాయలు, నిత్యావసర ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మరో పక్క వంట నూనె ధరలు భగభగమని మండుతున్నాయి. కేంద్రం, రాష్ట్రంలో ఉన్నకూటమి ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాల్సింది పోయి వాటిని పెంచే విధంగా నిర్ణయాలు తీసుకోవడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. కేంద్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం వినియోగదారుల నెత్తిన పిడుగై పడింది. దాంతో నిత్యం వంటల్లో వాడుకునే పామాయిల్, సన్‌ఫ్లవర్ అయిల్ ధరలు వారం రోజుల్లోనే ఆకాశాన్ని అంటాయి. ఎప్పుడూ లేని విధంగా పామ్ అయిల్, సన్‌ఫ్లవర్ అయిల్ లీటర్ ప్యాకెట్ ధర ఒక్కసారే రూ.40లు పెరగడంతో సామాన్యులు విలవిల్లాడుతున్నారు. ప్రతి గృహంలో వాడే వంట నూనెల్లో అత్యధికంగా వాడే నూనెలు, పామాయిల్, సన్‌ఫ్లవర్ అయిల్. ఆ తరువాతనే శనగ నూనె వాడకం ఉంటుంది. శనగ నూనె లీటర్ ప్యాకెట్ ధర రూ.140 నుంచి రూ.175 వరకు రకాన్ని బట్టి విక్రయిస్తున్నారు. ప్రస్తుతం దీని ధర నిలకడగానే వుంది. అయితే గత వారం నుంచి నూనెల ధరలను పరిగణలోకి తీసుకుంటే శనగ నూనె ధర స్థిరంగా ఉన్నా, పామాయిల్, సన్‌ఫ్లవర్ అయిల్ ధరలకు రెక్కలొచ్చాయి.





కూటమి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతోనే ధరల పెంపు..

గతంలో పామాయిల్ దిగుమతిపై రూ.12 శాతం జీఎస్టీ ఉండుగా, వారం క్రితం దాన్ని రూ.33 శాతానికి పెంచారు. దాంతో వారం క్రితం లీటరు నూనె ప్యాకెట్ ధర రూ. 85 నుంచి రూ.90 ఉండగా, జీఎస్టీ పెరుగుతలతో రూ.130కి చేరుకుంది. హోల్ సేల్ మార్కెట్‌లో రూ.125కు ఇస్తున్నారు. అదే విధంగా సన్‌ఫ్లవర్ ప్రస్తుతం రూ.165కి చేరుకుంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కందిపప్పు, ఉల్లిపాయలు, వంటనూనెల ధరలే కాకుండా, కందిపప్పు, ఉల్లిపాయలు, తదితర నిత్యావసరవస్తువుల ధరలు పెరిపోవడంతో సమాన్యులు విలవిల్లాడుతున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా నిత్యావసరవస్తువుల ధరలను తగ్గించే దిశగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కూటమి ప్రభుత్వాన్ని ఎందుకు గెలిపించామా.. అని ప్రజలు నెత్తినోరూ బాదుకుంటున్నారు.

> **నూనెలు కొనలేకపోతున్నాం..**
> వంటలు ఆకాశాన్ని అంటాయి. వారం రోజుల్లోనే సన్‌ఫ్లవర్ పామ్ ఆయిల్ ధరలు లీటర్‌కు ఒక్కసారి రూ.40 వరకు పెరిగింది. ప్రస్తుతం లీటర్‌కు రూ.130 పలుకుతోంది. ఒక వైపు నిత్యావసర వస్తువుల ధరలు, మరోవైపు కూరగాయల ధరలు అదిరిపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో సామాన్యులు ఉత్తి అన్నం తినాల్సిందే.
> – కృష్ణవేణి, తిమ్మాయపాలెం

> **ప్రభుత్వం ధరలు తగ్గించాలి..**
> పామాయిల్, సన్‌ఫ్లవర్ మీద ప్రభుత్వం పన్నులు వేయడం వల్లే ధరలు పెరిగాయని వ్యాపారులు చెప్తున్నారు. దాంతో ఆయిల్ ధరకు రెక్కలొచ్చినట్లయింది. వారంలోనే ఇంత వ్యత్యాసం వస్తే ఏం చేయాలి. సామాన్యుడు బతికే పరిస్థితి లేదు. ప్రభుత్వం చర్యలు తీసుకుని ఆయిల్ ధరలు తగ్గేలా చూడాలి.
> – మోటుపల్లి రామయ్య , అద్దంకి

ఈ–క్రాప్‌తో రైతులకు ప్రయోజనాలు



కలవకూరులో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి వెంకటకృష్ణ



ఈ–క్రాప్ నమోదును పరిశీలిస్తున్న డీటీ మస్తాన్‌రావు

అద్దంకి: ఈ–క్రాప్‌తో పలు ప్రయోజనాలు ఉంటాయని వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. సోమవారం నాటికి పంట నమోదు పూర్తిచేయాలని ఏవో వెంకటకృష్ణ అన్నారు. మండలంలో ఇప్పటి వరకు 8,358 ఎకరాల్లో పంట నమోదు పూర్తి చేసి నూరు శాతం నమోదు చేశామని చెప్పారు. ఇంకా మండలంలో 10 శాతం మంది రైతులు పెండింగ్‌లో ఉన్నారని తెలిపారు. కలవకూరులో సూపర్ చెక్ తనిఖీ నిర్వహించారు. పూర్తయిన తరువాత సామాజిక తనిఖీ, గ్రామసభ నిర్వహించి తుది జాబితాను గ్రామ సచివాలయం వద్ద ప్రచురిస్తామని చెప్పారు.

యద్దనపూడి: రైతులు తాము సాగుచేస్తున్న పంటలను ఈ–క్రాప్‌లో నమోదు చేయించుకోవటం ద్వారా బహుళ ప్రయోజనాలు పొందవచ్చని డిప్యూటీ తహశీల్దారు మస్తాన్‌రావు అన్నారు. వ్యవసాయశాఖ ఆదేశాల మేరకు శనివారం మండలంలోని యద్దనపూడి, యనమదల గ్రామాల్లో రైతులు ఈ–క్రాప్ సూపర్‌చెక్ కార్యక్రమంలో భాగంగా రైతులు సాగుచేస్తున్న పంటపొలాలను సందర్శించారు. కార్యక్రమంలో వీఏఏలు నాయుడు వినయ్‌దత్త, నరేంద్ర కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కరిముల్లాకు విశిష్ట విద్యాసేవా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న కరిముల్లా

మార్టూరు: మండలంలోని వలపర్ల గ్రామానికి చెందిన నేతాజీ విద్యాసంస్థల యజమాని సయ్యద్ కరిముల్లా శనివారం రాష్ట్రస్థాయి విశిష్ట విద్య సేవా పురస్కారం అందుకున్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ డెమోక్రటిక్ సంస్థ ఆధ్వర్యంలో కృష్ణా జిల్లా జగ్గయ్యపేటలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ పురస్కారం అందుకున్నారు. గత నాలుగు దశాబ్దాలకు పైగా విద్యాసంస్థలు నిర్వహిస్తూ వేలాదిమంది విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దినందుకుగాను నిర్వాహకులు పురస్కారాన్ని అందించారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణ్ చేతుల మీదుగా కరిముల్లా అవార్డు అందుకున్నారు.

పద్మశాలీయ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన జంజనం



అబద్దయ్యను సన్మానిస్తున్న శ్రీనివాసరావు

చీరాల: ఆంధ్రప్రదేశ్ పద్మశాలీయ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన నందం అబద్దయ్యను శనివారం చీరాల మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావుతో పాటు చీరాలకు చెందిన పలువురు కలిసి సన్మానించారు. కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా, సోమవారం ప్రమాణ స్వీకారం చేస్తున్నందుకు మంగళగిరిలోని ఆయన స్వగృహంలో సన్మానించారు. మున్సిపల్ చైర్మన్ వెంట బాలా హ్యాండ్‌లూమ్స్ అధినేత, దీ చీరాల చేనేత వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు బండారు బాల నాగేశ్వరరావులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి సహకారం అభినందనీయం



మంచినీటి సరఫరాను ప్రారంభిస్తున్న రామానంద సరస్వతి, ఎమ్మెల్యే కొండయ్య

చీరాల టౌన్: తీరప్రాంత గ్రామాల అభివృద్ధికి, పేద వర్గాల వారి అభ్యున్నతికి వాడరేవు రామానంద సరస్వతి స్వామీజి అందిస్తున్న సేవలు ఎనలేనివని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. శనివారం మండలంలోని వాడరేవు, తదితర తీరప్రాంత గ్రామాల ప్రజలకు శుద్ధమైన మంచినీరు అందించేందుకు రామానంద సరస్వతి ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.15 లక్షల విలువైన ట్రాక్టర్, పదివేల లీటర్ల సామర్థ్యం కలిగిన రెండు మంచినీటి ట్యాంకర్లు తీర ప్రాంత ప్రజలకు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో స్వామీజి అందజేశారు. మినరల్ వాటర్ ట్యాంకర్లు ద్వారా గ్రామ ప్రజలకు సరఫరాను రామానంద సరస్వతి స్వామి, ఎమ్మెల్యే కొండయ్యలు ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తీరప్రాంత గ్రామాలకు స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు చేయడం గొప్పవిషయమన్నారు, నిరంతరం సేవా కార్యక్రమాలు చేస్తున్న రామానంద సరస్వతి స్వామిని ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో ఆశ్రమం మేనేజర్ నారాయణం సురేష్, గ్రామపెద్దలు, మత్స్యకార నాయకులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న వ్యక్తుల అరెస్టు

చినగంజాం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై రమేష్ వివరాల మేరకు.. శనివారం పెదగంజాం గ్రామం నుంచి అనుమతులు లేకుండా రెండు ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు బుచ్చిగుంట గ్రామం సమీపంలో ట్రాక్టర్లను పట్టుకొని అదుపులోనికి తీసుకున్నారు. ఇసుక తరలిస్తున్న పెదగంజాం గ్రామానికి చెందిన మరుప్రోలు అన్నారెడ్డి, ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన మాదాసు వెంకటేశ్వరరావులను అరెస్టు చేశారు. పెదగంజాం గ్రామం నుంచి తక్కువ రేటుకు ఇసుక కొనుగోలు చేసి ఉప్పుగుండూరులో ఎక్కువ రేటుకు అమ్ముకునేందుకు ఇసుక తీసుకెళుతున్నట్లు పోలీసులు చెప్పారు. ఈ మేరకు వారిరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా భావన్నారాయణుని బ్రహ్మోత్సవాలు



హనుమద్వాహనంపై భావన్నారాయణ స్వామి

చినగంజాం: స్థానిక భావన్నారాయణస్వామి ఆలయంలో స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం స్వామి వారికి విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. పరాశరం రామాచార్యులు, ఆలయ అర్చకులు ఏ మోహన లక్ష్మీ నరసింహాచార్యులు ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. పూజా కార్యక్రమాలలో ఉభయ దాతలుగా వలివేటి సుభాషిణి, మణికంఠ, జ్ఞాన రేవతి, బాల వెంకట సుమన్, అనూష దంపతులు పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో భక్తులు విష్ణుసహస్ర నామ పారాయణం నిర్వహించారు. రాత్రికి స్వామి వారిని హనుమద్వాహనంపై ఉంచి గ్రామంలోని ప్రధాన వీధులలో గ్రామోత్సవం నిర్వహించారు. ఊరేగింపులో మహిళా కోలాట బృందాలు ప్రదర్శించిన కోలాటం ప్రజలను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వీ శివనారాయణ, వీవీ రామానుజం, జీ పిచ్చయ్య భక్తులు విశేషంగా పాల్గొన్నారు.




చినగంజాం: అన్నపూర్ణాదేవి అలంకారంలో లలితాంబ అమ్మవారు



అద్దంకి ధన్వంతరీ దత్తపాదుకా క్షేత్రంలో అమ్మవారు



అద్దంకిలో లలితాదేవి అలంకరణలో వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి..



చెన్నుపల్లిలో అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు



కారంచేడులో గాయత్రీదేవిగా అమ్మవారు

భిక్షాందేహి.. మాతా అన్నపూర్ణేశ్వరి

- మూడో రోజు అన్నపూర్ణదేవీగా అమ్మవారు
- వైభవంగా దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు

కారంచేడు/మార్టూరు/చినగంజాం/యద్దనపూడి: దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వామ హస్తమున అక్షయమైన అన్నపాత్ర, దక్షిణ హస్తయున్న ఒక గరిటతో భక్తులకు దర్శనమిచ్చారు. సాక్షాత్తు త్రినేత్రునికే భిక్షను ప్రసాదించిన అమృతమూర్తి అన్నపూర్ణాదేవిని దర్శించటం వల్ల అన్నాదులకు లోటులేకుండా ఇతరులకు అన్నదానం చేసే సౌభాగ్యం కలుగుతుందని భక్తుల నమ్మకం. ఈసందర్భంగా అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన, దేవీ ఖడ్గ మాల, త్రిశూల, లలిత సహస్ర నామార్చన, శ్రీచక్రార్చనలతో అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. జాగర్లమూడిలోని ఉజ్జయినీ మహంకాళీ అమ్మవారి ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవీగా అలంకరించి విశేషపూజలు నిర్వహించారు.

■ చినగంజాం లలితా రామకోటేశ్వరాలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవి (శాకంబరీ దేవి) అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పూజారి శంకరమంచి హనుమంతరావు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించగా నున్నా హరినాథ్‌బాబు దంపతులు ఉభయ దాతలుగా పూజలలో పాల్గొన్నారు.

■ కారంచేడు రెండు చెరువుల మధ్యన కొలువైన వైష్ణవీ దుర్గామాత ఆలయంలో అమ్మవారిని బాలా గాయత్రిదేవిగా అలంకరించారు. గ్రామంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం, వేణుగోపాలస్వామి గుడి, పెదబజారు శివాలయం, వెంకటేశ్వరస్వామివారి గుడి, సాయి మందిరం, కట్టమల్లేశ్వర స్వామివారి గుడి, స్వర్ణ వెంకటేశ్వరస్వామివారి ఆలయం, గంగమ్మగుడి, శివాలయం, వల్లభరాయ స్వామివారి ఆలయం, తిమిడెదపాడు భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలోను అమ్మవారిని గాయత్రిదేవిగా ఆలయ అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు.

■ పర్చూరు మండలంలోని నూతలపాడు గ్రామంలో భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి నవరాత్రుల 12వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకారంలో భక్తులను అలరించారు. ఉత్సవ కమిటీ ఆదిపూడి మోహనకృష్ణ, వల్లభరెడ్డి శ్రీనివాసరెడ్డి, లింగంగుంట సుబ్రహ్మణ్యంలు పాల్గొన్నారు. అద్దంకి నాంచారమ్మ అమ్మవారి దేవస్థానంలో వైస్ ఎంపీపీ కోట ప్రసన్న, కోట శ్రీనివాసరావు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

లలితాదేవిగా అమ్మవారు..

అద్దంకి రూరల్/బల్లికురవ: అద్దంకిలోని వాసవి కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవస్థానంలోని అమ్మవారిని లలితాదేవి అమ్మవారుగా, ధన్వంతరీ దత్తపాదుకా క్షేత్రంలో అమ్మవారిని గాయత్రిదేవిగా అలంకరించారు. అనంతరం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

■ బల్లికురవ మండలంలో దసరా నవరాత్రుల సందర్భంగా చెన్నుపల్లి, కొండాయపాలెం, కొణిదెన, కొప్పరప్పాడు, చిన అంబడపూడి గ్రామాల్లో భజనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

అద్భుతం వేంకటేశ్వరస్వామి గానామృతం..

చీరాల అర్బన్/వేటపాలెం: దసరా శరన్నవరాత్రులు చీరాలలో ఘనంగా నిర్వహిస్తున్నారు. స్థానిక సంతబజారులోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో నవరాత్రి ఉత్సవాలలో భాగంగా వెంకటేశ్వరస్వామి గానామృత కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అలానే దేవాలయంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. అనంతరం వెంకటేశ్వరస్వామి గానామృత కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని తిలకించారు. నవరాత్రులలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ అధ్యక్షుడు గుంటూరు మాధవరావు తెలిపారు.

■ వేటపాలెం గడియార స్తంభం సెంటర్‌లోగా వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని గరుడవాహనంపై ఊరేగింపు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు.



నూతలపాడు ఆలయంలో అన్నపూర్ణదేవి అవతారంలో..



వేటపాలెంలో కాత్యాయని దేవిగా కన్యకాపరమేశ్వరి అమ్మవారు



చీరాల: ప్రత్యేక అలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారు



అద్దంకి నాంచారమ్మ గుడిలో పూజలు చేస్తున్న వైస్ ఎంపీపీ దంపతులు



జాగర్లమూడిలో అన్నపూర్ణాదేవి అలంకరణలో ఉజ్జయినీ మహంకాళి అమ్మవారు



మార్టూరులోని పాండురంగ స్వామి ఆలయంలో గాయత్రీదేవిగా అమ్మవారు